స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలి

జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి

భీమవరం :నా మట్టి - నా దేశం కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి కోరారు. కలెక్టరేట్లో బుధవారం నా మట్టి - నా దేశం కార్యక్రమంపై సమీక్షించి మాట్లాడారు. ఈ నెల 9వ తేదీ నుంచి నా మట్టి - నా దేశం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని, నేటి వరకూ వివిధ కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో సమసమాజ నిర్మాణం వైపు ప్రజలంతా అడుగులు వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ జాతీయ భావంతో మెలగాలన్నారు. నా మట్టి - నా దేశం కార్యక్రమాలు జిల్లాలోని ప్రతి పంచాయతీలో జయప్రదంగా నిర్వహించుకున్నామన్నారు. స్వచ్ఛంద సంస్థలు ప్రణాళికా బద్ధంగా కార్యక్రమాలను రూపొందించి జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జివికె మల్లికార్జునరావు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగ సాయి, జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ రామ్ బద్రిరాజు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించారు.. లక్ష్యం మరిచారు..!

నిరుపయోగంగా మత్స్యకార భవనాలు

లక్షలాది రూపాయలు వెచ్చించి మత్స్యకారుల కోసం నిర్మించిన భవనాలు 15 సంవత్సరాలుగా నిరుపయోగంగానే ఉన్నాయి. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరడం గమనార్హం. దీనిపై మత్స్యకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన భవనం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ ఏటిమొండి ప్రాంతంలో సుమారు పదిహేనేళ్ల కిందట రూ.96 లక్షలు వెచ్చించి మత్స్యకారులకు ఉపయోగపడేలా భవనాలు నిర్మించారు. ఉప్పుటేరు, సముద్రంలో వేటాడిన మత్స్య సంపదను ఎండబెట్టుకోవడానికి డ్రై ఫిష్ ప్లాట్‌ఫారం, వలల మరమ్మతులు, భద్రపర్చుకోవడానికి, మత్స్యకారులు విశ్రాంతి తీసుకునేందుకు భవనాలు నిర్మించారు. వాటికి విద్యుత్ సౌకర్యం సైతం ఏర్పాటు చేశారు. అలాగే ప్రధాన మార్గం నుంచి అంతర్గత రహదారులు, భవనాల చుట్టూ ప్రహరీ నిర్మించారు. అయితే గ్రామానికి, మత్స్యకారులకు దూరంగా ఉండటంతో వారు వీటి వినియోగంపై పెద్దగా ఆసక్తిచూపలేదు. దీనిపై దృష్టి సారించి మత్స్యకారులకు అవసరమైన మరిన్ని సౌకర్యాలు కల్పించి అప్పగించాల్సిన అధికారగణం కూడా పెద్దగా పట్టించుకోకపోవడంతో ఈ భవనాలు వినియోగంలోకి రాలేదు. దీంతో ఆ భవనాల్లో విద్యుత్ ఉపకరణాలు, తలుపులు తదితర సామగ్రి అపహరణకు గురయ్యాయి. నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆ ప్రాంతంలో ముళ్లచెట్లు పెరిగిపోయి అడవిగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలను ఇప్పటికైనా మరమ్మతులు చేసి మత్స్యకారులకు అవసరమైన సౌకార్యలు కల్పించి వారికి అవగాహన కల్పించడం ద్వారా వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న మత్స్యసంపద ఎండబెట్టేందుకు ఏర్పాటు చేసిన ఫ్లాట్ పామ్

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి

జిల్లా పరిషత్ సిఇఒ రవికుమార్

ప్రజాశక్తి - భీమవరం

గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా అధి కారులు కృషి చేయాలని జిల్లా పరిషత్ సిఇఒ కెవిఎస్ఆర్ రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె మల్లికార్జునరావుతో కలిసి జిల్లా పరిషత్ సిఇఒ పంచాయతీ ఎన్నిక నిర్వహణ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో వివాదాలకు తావులేకుండా నిర్వహించాలన్నారు. గతంలో ఎన్నికలు నిర్వహించిన అనుభవం ఎక్కువమంది ఉద్యోగులకు ఉంటుందని, ఎన్నికల నిర్వహణలో కొత్తవారు ఎవరైనా ఉంటే సందేహాలను నివృత్తి చేసుకుని విధులు నిర్వహించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జివికె మల్లికార్జునరావు మాట్లాడుతూ ఒక సర్పంచి, 10 వార్డు మెంబర్ల పదవులకు ఈ నెల 19న ఎన్నికలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఎన్నికల, జిల్లా నోడల్ అధికారి, నరసాపురం ఎంపిడిఒ ఎన్‌విఎస్.ప్రసాద్ యాదవ్, పిఒలు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ఓటర్ల సర్వే పక్కాగా చేయాలి

బిఎల్ఒలకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

ప్రజాశక్తి - పాలకోడేరు

ఓటర్ల సర్వే పక్కాగా చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బిఎల్ఒలను హెచ్చరించారు. విస్సాకోడేరు గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. డోర్ టు డోర్ సర్వే, ఎన్ని గృహాలు పూర్తయ్యాయి, ఇంకా ఎన్ని గృహాలు మిగిలున్నాయని అడిగి తెలుసుకున్నారు. మరణించిన వారు ఎంతమంది ఉన్నారు, వారి ఓట్లు తొలగించారా లేదా అని పరిశీలించారు. కొత్తగా ఎన్ని ఓట్లు నమోదయ్యాయి, చేర్పులు, మార్పులు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను, కంప్యూటర్ డేటాను కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ఓటర్ల ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని దోష రహితంగా తయారు చేయాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో వాలంటీర్లను భాగస్వాములను చేస్తున్నట్లు తేలితే సంబంధిత అధికారులపై కఠినచర్యలు తప్పవని జిల్లా హెచ్చరించారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని ప్రాధాన్యతా అంశంగా తీసుకొని ఈ నెల 21వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. నిర్ణీత గడువు సమీపిస్తున్నందున ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టి మరింత వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగభూషణరావు, ఎలక్షన్ సూపర్‌వైజర్ శేషయ్యనాయుడు, బిఎల్ఒలు పాల్గొన్నారు.

పాలకొల్లులో వర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో బుధవారం సాయంత్రం తేలికపాటి వర్షం పడింది. దీంతో వాతావరణం చల్లబడింది. పదిహేను రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో, ఉక్కపోతతో ప్రజలు సతమవుతున్నారు. ఈ నేపథ్యంలో వర్షం పడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. మంగళవారం రాత్రి భారీ వర్షం పడింది. బుధవారం కూడా వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

ఉపాధ్యాయులను గందరగోళ పర్చొద్దు

యుటిఎఫ్ ఆధ్వర్యాన డిఇఒకు వినతి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం ఇంత వరకూ బదిలీ, ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వకుండానే మరలా వర్కింగ్ పేరుతో వారిని గందరగోళానికి గురిచేయడం తగదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అన్నారు. కలెక్టరేట్లో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వి.రమణకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయరామరాజు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకుండా పని ఒత్తిడి పెంచడం దారుణమన్నారు. మూడు నెలల నుంచి జీతాలందక ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వర్క్ అలాట్మెంట్లో లోపాలను సరిచేసి సవరణకు అవకాశం ఇవ్వాలన్నారు. జిఒ 117, 128 ప్రకారం తుది జాబితా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏ మండలంలో ఉన్న ఉపాధ్యాయులను అదే మండలంలో సర్దుబాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.రాజశేఖర్ ట్రెజరర్ పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు సాయిరాం, ఏసుబాబు, రామకృష్ణంరాజు, రామకృష్ణ, ప్రసాద్, క్రాంతి కుమార్, బాబ్జీ పాల్గొన్నారు.

భావితరాలకు తెలిపేందుకే విగ్రహాల ఏర్పాటు

ప్రజాశక్తి - తణుకు

తణుకుకు చెందిన స్వాతంత్ర సమరయోధుల చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని బ్యాంక్ కాలనీలో స్వాతంత్ర సమరయోధుల ఉద్యానవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన 18 మంది సమర యోధుల విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరు భారతదేశాన్ని ఆంగ్లేయులు ఆక్రమించిన రోజుల్లో స్వాతంత్రం కోసం పోరాటాలు చేసి జైలు జీవితాలు గడిపారన్నారు. తణుకులో రాజకీయాలకు అతీతంగా మాజీ ఎంఎల్ఎల అందరి విగ్రహాలతో పాటు వారి పేరు మీద కమ్యూనిటీ హాళ్లు నిర్మించానని తెలిపారు. వైఎస్ఆర్ పార్కులో దేశ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ పార్కులో మంత్రి ఆధ్వర్యంలో విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తన తండ్రి విగ్రహం కూడా ఉండడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం సమరయోధుల కుటుంబ సభ్యులను మంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజి కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, మున్సిపల్ కమిషనర్ కెటి.సుధాకర్, డిఇ ఈశ్వర్‌రెడ్డి, ఎఎంసి ఛైర్మన్ నత్తా కృష్ణవేణి, ఎఎంసి వైస్ ఛైర్మన్ మారిశెట్టి శివశంకర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

టిడిపితోనే మహిళా సాధికారత సాధ్యం

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

మహిళా సాధికారత టిడిపితోనే సాధ్యమని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. ఏలూరుపాడు గ్రామంలో టిడిపి 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకోవడంతోపాటు పెరిగిన విద్యుత్ ఛార్జీలు, గ్యాస్ ధరలు, ఇంటి, చెత్త పన్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే అన్ని తరగతుల ప్రజలకూ న్యాయం జరుగుతుందన్నారు. మహిళలకు డ్వాక్రా తీసుకొచ్చి వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేసిన ఏకైక పార్టీ టిడిపి అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే యువతకు ఏటా రూ.36 వేలు అందిస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో అంశాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి తోట ఫణిబాబు, కాలువ లక్ష్మి వెంకట్రావు, టి.లీలావతి, మాజీ సర్పంచి ఆంజనేయరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మంతెన రామరాజు

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పాలకొల్లు

వాదించుకుంటే ఎవరో ఒకరే గెలుస్తారని, చర్చించుకుంటే ఇరువురూ గెలిచినట్టేననే ఉద్దేశంతో దేశ అత్యున్నత న్యాయస్థానం లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వరలక్ష్మి చెప్పారు. కోర్టు హాల్లో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వచ్చే నెల 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల డబ్బు, సమయం ఆదా అవుతాయన్నారు. చెక్ బౌన్స్, కుటుంబ తగాదా, రాజీయోగ్యమైన కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాకు సహకరించాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి అందరూ సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను డిఆర్ఒ కె.కృష్ణవేణి కోరారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంపై ప్రతినిధులతో డిఆర్ఒ సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఓటర్ల సర్వే ఈనెల 21వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి జాబితాను పరిశీలిస్తారన్నారు. ఇప్పటివరకు ఓటర్ల జాబితాలో పోలింగ్ కేంద్రాల వారీగా కొత్తగా నమోదైన వారు, చేర్పులు మార్పులు, తొలగింపుల జాబితా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే 74.80 శాతం సర్వే కార్యక్రమం పూర్తయినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలన్ అడిగిన ప్రశ్నకు జవాబుగా డిఆర్ఒ తెలిపారు. సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ లక్కు నరసింహారావు, ప్రజా ప్రతినిధులు కామన నాగేశ్వరరావు, కోమటి రవికుమార్, మరపట్ల శ్యాంబాబు, జెఎన్‌వి గోపాలన్, కె.కరుణాకర్ పాల్గొన్నారు.

గాడి తప్పిన వైద్యం..!

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పరిస్థితి ఘోరం

చిన్నపాటి కేసులు సైతం విజయవాడ, గుంటూరుకు రిఫర్

గత్యంతరం లేక ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న రోగులు

సీనియర్ వైద్యుల బదిలీతో వైద్య సేవలకు తీవ్ర ఆటంకం

ఆసుపత్రి పర్యవేక్షణను పూర్తిగా గాలికొదిలేసిన బాధ్యులు

తాజా ఘటనతో మరోసారి సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవలపై చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది' అనే చందంగా ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యసేవలు తయారయ్యాయి. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు ఎంతోమంది రోగులకు రక్షణగా నిలిచిన ఆసుపత్రిలో నేడు వైద్యసేవలు పూర్తిగా గాడి తప్పిన పరిస్థితి నెలకొంది. ఏలూరులోని జిల్లా ఆసుపత్రిని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా మార్పు చేశారు. ఈ ఏడాది 150 మంది వైద్య విద్యార్థులు సైతం ఇక్కడ బోధనా ఆసుపత్రిలో వైద్య విద్య అభ్యసించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బోధనా ఆసుపత్రిగా మారితే మరిన్ని వైద్య సదుపాయాలు, స్పెషలిస్ట్ వైద్యులు, సాంకేతికత అందుబాటులోకి వస్తాయని అంతా ఆశించారు. అయితే పరిస్థితి అందుకు విరుద్ధంగా తయారైంది. బోధనా ఆసుపత్రిగా మారడంతో సీనియర్ వైద్యులను వేరే ప్రాంతాలకు బదిలీ చేశారు. దీంతో వైద్య సేవలు పూర్తిగా పడకేశాయి. జిల్లా ఆసుపత్రిగా ఉండగా రోజుకు 1200 నుంచి 1500 మంది అవుట్ పేషెంట్లు ఆసుపత్రికి వచ్చి వైద్యసేవలు పొందేవారు. సరైన వైద్యులు లేకపోవడంతో ప్రస్తుతం 600 నుంచి 800 మంది రోగులు మాత్రమే ఒపి సేవలు పొందుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దీనికి ప్రధాన కారణం అధికారుల పర్యవేక్షణ కొరవడటమేనని చెప్పొచ్చు. గతంలో సూపరింటెండెంట్‌గా పని చేసిన అధికారులు ఆసుపత్రిలో చిన్నపాటి సమస్య వచ్చినా వెంటనే స్పందించడం, తగు చర్యలు తీసుకోవడం వంటివి చేసేవారు. సర్వజన ఆసుపత్రిగా మారిన తర్వాత బాధ్యతలు స్వీకరించిన పర్యవేక్షణాధికారులు జనాలకు దూరంగా ఉంటున్న పరిస్థితి ఉంది. ఎవరితోనూ మాట్లాడే పరిస్థితి లేదనే చర్చ నడుస్తోంది. ఇష్టం లేకుండా ఇక్కడకు వచ్చినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. రోగుల గురించి పెద్దగా పట్టించుకోని పరిస్థితి ఉంది. గతంలో ఏలూరుతోపాటు పరిసర ప్రాంతాల్లో తలతిరిగి పడిపోయిన వ్యాధితో దాదాపు 600 మందికిపైగా ఆసుపత్రిలో చేరారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి అందరినీ కోలుకునే విధంగా చేసి రాష్ట్రస్థాయిలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రత్యేక ఖ్యాతి గడించింది. పురుగుల మందు తాగిన రోగులను ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఇక్కడికే తరలించేవారు. మెరుగైన వైద్యం అందించి పంపించేవారు. అలాంటి పరిస్థితి ఇప్పుడు మచ్చుకైనా కానరావడం లేదు. చిన్నపాటి కేసులను కూడా విజయవాడ, గుంటూరుకు రిఫర్ చేస్తున్నారు. తమకు ఏమీ సంబంధం లేదన్నట్లు వదిలించుకుంటున్నారు. అటువంటప్పుడు బోధనా ఆసుపత్రిగా మార్పు చేసి ప్రయోజనం ఏమిటని జనం ప్రశ్నిస్తున్నా సమాధానం చెప్పే నాథుడే లేకుండాపోయాడు. సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవలపై జనం నుంచి తీవ్ర విమర్శలు వస్తూనే ఉన్నాయి.

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి

తాజా ఘటనతో వైఫల్యాలు బట్టబయలు

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేరిన గర్భిణికి ఆపరేషన్ చేసిన వైద్యులు కడుపులో ఫోర్‌సెప్స్ వదిలేసిన తాజా ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనను బయటకు రాకుండా చేయాలని ఆసుపత్రి అధికారులు తీవ్ర ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల ఎనిమిదో తేదీన కడుపునొప్పితో బాధిత మహిళ ఆసుపత్రిలో చేరినప్పటికీ 16వ తేదీ వరకూ బయటి ప్రపంచానికి తెలియకుండా చేశారు. విజయవాడ ఆసుపత్రికి రిఫర్ చేసి చేతులు దులుపుకున్నారు. ఇదేవిధంగా సరైన వైద్యసేవలు అందక రోగులు పడుతున్న ఇబ్బందులు బయటికిరాని పరిస్థితి నెలకొంది. వైద్యసేవలపై అధికారులు దృష్టి సారించకపోవడమే దీనికి ప్రధాన కారణమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. రిఫరల్ కేసులపైన, సర్వజన ఆసుపత్రిలో వైద్యసేవలపైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా ఎక్స్‌రే, స్కానింగ్ వంటి రిపోర్టులు ఒకరోజు తర్వాత ఇస్తున్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు రెండు, మూడు రోజులు ఆసుపత్రి చుట్టూ తిరగాల్సి వస్తోంది. పరీక్షలు చేసిన తర్వాత రిపోర్టులు త్వరితగతిన ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ తనిఖీ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పూలపల్లి సచివాలయం వద్ద జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ క్యాంపును జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మహేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవల, ఓపిల నమోదుపై డాక్టర్ లీనా సుప్రియను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి యువిన్ యాప్ ద్వారా నమోదు చేసే కార్యక్రమాన్ని అడిగి తెలుసుకున్నారు. సిడి ఎన్‌సిడి కార్యక్రమంలో నమోదు తక్కువగా ఉందని దాన్ని వెంటనే ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సూపర్‌వైజర్ డి.కమల, ఎంఎల్‌హెచ్‌పిలు కృష్ణవేణి, శ్రావణి, ఎఎన్ఎం.విజయశాంతి, హెల్త్ అసిస్టెంట్ ఏసునాదం, డిఇఒ సురేష్, సింగ్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిఎంహెచ్ఒ

ఆదర్శ్ సేవలు అభినందనీయం : కమిషనర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛందంగా ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ పి.శామ్యూల్ అన్నారు. ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ కమిటీ సమావేశం రేణుక ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కమిషనర్ శామ్యూల్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రజలకు సేవలందించడం సంతోషదాయకమన్నారు. ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ రొక్కాల నాగబుజ్జి ఆధ్వర్యంలో చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులను, రిటైర్ ఉద్యోగులను, సోషల్ వర్కర్స్‌ను, స్వచ్ఛంద సంస్థల సభ్యులను, వైద్య సిబ్బందిని, పారిశుధ్య కార్మికులను, జర్నలిస్టులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐజెయు జాతీయ కార్యవర్గ సభ్యులు డి.సోమసుందర్, జిజె జ్యోతి ఆనంద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

విద్యార్థినులకు యూనిఫాం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

విద్యార్థినులకు యూనిఫామ్ అందజేత

ప్రజాశక్తి - వీరవాసరం

రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులకు ఆ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో యూనిఫాం అందించారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 1984-85 పదో తరగతి చదివిన విద్యార్థులు సుమారు రూ.50 వేల విలువైన యూనిఫాం దుస్తులను విద్యార్థినులకు అందించారు. ఇదే బ్యాచుకు చెందిన పూర్వ విద్యార్థులు గతంలో స్కూల్ ఐరన్ గేటు అందించారు. హై స్కూల్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటు కావడం, బాలికలకు కళాశాల విద్య స్థానికంగా అందుబాటులో రావడం పట్ల పూర్వ విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థులకు గ్రామ సర్పంచి గెడ్డం భారతీభాస్కరరావు, ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, గుబ్బల సత్యనారాయణ, జవ్వాది దాసరధి శ్రీనివాసరావు, షేక్ సత్కాతర్ సాహెబ్, నార్కేడమల్లి పేరుమల్ల గుప్త, కిషోర్, గుబ్బల రాంప్రసాద్, సుబ్రహ్మణ్యశర్మ, కాయల వీరాస్వామి పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నేత్రాల పట్ల జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - గణపవరం

కంటి చూపు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మేక్సివిజన్ కంటి ఆసుపత్రి టెక్నికల్ సిబ్బంది కరుణాకర్ సుధాకర్ శేఖర్ అన్నారు. స్థానిక డిగ్రీ కాలేజీలో గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు ప్రారంభించారు. ఈ శిబిరంలో వంద మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో జోన్ ఛైర్మన్ కె.సత్యనారాయణ, కె.విశారద, సిహెచ్.రవికుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దంత వైద్య నిపుణురాలు షాలినిరెడ్డి

దంతాల సంరక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులకు దంత సంరక్షణ చాలా అవసరమని పెనుగొండ రత్నాస్ దంత వైద్య నిపుణురాలు మేడపాటి షాలిని రెడ్డి అన్నారు. మల్లిపూడి చాణిక్య పబ్లిక్ స్కూలులో ప్రిన్సిపల్, కరస్పాండెంట్ మల్లిడి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పెనుగొండ దంత వైద్య నిపుణులచే బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి) ప్రారంభించారు. ఈ సందర్భంగా దంత వైద్య నిపుణుడు మేడపాటి మురళి జోగిరెడ్డి దంత సంరక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి) మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఉదయం, రాత్రి దంతాలను శుభ్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కుసుమ సంతోషి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 17వ తేదీన పెనుమంట్ర పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెనుమంట్ర 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో మాముడూరు ఫీడర్‌లో రోడ్ క్రాసింగ్ పోల్స్ మారుస్తున్న నేపథ్యంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మాముడూరు బొక్కవారిపాలెం, నత్త రామేశ్వరం సెంటర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలాగే పెనుమంట్ర గ్రామ పరిధిలో రోడ్డు క్రాసింగ్ పోల్స్ మారుస్తున్న నేపథ్యంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు గరువు, మాముడూరు పుంత, అయ్యప్ప పుంత, ధనమ్మ పుంత ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ఇద్దరు యువకులకు చెట్టుకు కట్టేసిన గ్రామస్తులు

కోలనపల్లిలో చోరీకి విఫలయత్నం

ముగ్గురు యువకులు పరారీ

ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కోలనపల్లిలోని ఓ ఇంట్లో బుధవారం తెల్లవారుజామున కొంతమంది దుండగులు చోరీకి యత్నించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్ల గ్రామానికి చెందిన తోట సత్యనారాయణ కోలనపల్లిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. తోట సత్యనారాయణ బుధవారం రాత్రి ఆరుబయట నిద్రిస్తున్నాడు. ఈ క్రమంలో తెల్లవారుజామును ఐదుగురు వ్యక్తులు చోరీ చేసేందుకు ఇంట్లోకి ప్రవేశించారు. ఇది గమనించిన సత్యనారాయణ, స్థానికుల సాయంతో వారిని అడ్డుకున్నారు. వారిలో ముగ్గురు యువకులు పరారయ్యారు. ఇద్దరిని గ్రామస్తులు బంధించి చెట్టుకు కట్టేశారు. కారులో వచ్చిన యువకులు జువ్వలపాలేనికి చెందినవారుగా గుర్తించారు. పట్టుకున్న ఇద్దరిని పోలీసులకు అప్పగించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

పలువురికి ఉత్తమ అవార్డులు

పాలకోడేరు : అవార్డు అందుకుంటున్న స్వర్ణలత

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సాకోడేరు సెయింట్ జాన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ డిఆర్.స్వర్ణలతకు మహాత్మాగాంధీ జాతీయ అవార్డు లభించింది. గత 22 ఏళ్లుగా ఆమె చేస్తున్న సామాజిక సేవను గుర్తించి ఈ అవార్డును ఆదర్శ వెల్ఫేర్ సొసైటీ తాడేపల్లిగూడెం డైరెక్టర్ రొక్కలా నాగబుజ్జి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలోని రేణుక ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్వర్ణలతను సొసైటీ సభ్యులు, సెయింట్ జాన్స్ మీడియం హైస్కూల్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ అవారు మరింత బాధ్యత పెంచిందన్నారు.

కన్నయ్యకు ఉత్తమ విఆర్ఎ అవార్డు

కాళ్ల :విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు కలవపూడి విఆర్ఎ బందెల కన్నయ్య స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా విఆర్ఎ కన్నయ్యను తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, పలువురు రెవెన్యూ అధికారులు అభినందించారు.

ఉత్తమ ఎంపిడిఒగా మురళీగంగాధరరావు

పాలకోడేరు :పాలకోడేరు ఎంపిడిఒ నూకల మురళీ గంగాధరరావుకు నరసాపురం డివిజనల్ ఉత్తమ ఎంపిడిఒగా అవార్డు లభించింది. జెడ్‌పి ఛైర్మన్ పద్మశ్రీ చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒను ఆయన కార్యాలయంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి సత్యనారాయణరాజు మాట్లాడుతూ మరింత మెరుగైన సేవలు అందించాలని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం కార్యదర్శి బొల్లా శ్రీనివాస్, జంగం సూరిబాబు, పంచాయతీ కార్యదర్శులు పోలయ్య, లక్ష్మి, ప్రసాద్, రాజేష్, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

గోవిందరావుకు ఉత్తమ ఇఒ అవార్డు

పాలకొల్లు : పాలకొల్లు అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ఇఒ పిటి.గోవిందరావుకు స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉత్తమ సేవా పతాకం లభించింది. ఆలయ అభివృద్ధి, ఆలయానికి చెందిన బకాయిలు వసూలు చేయడంలో లక్ష్యాలు పూర్తి చేసిన నేపథ్యంలో కలెక్టర్ ప్రశాంతి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ పానకాలు, ట్రస్టీలు ఆయనను అభినందించారు.

మ్యాజిక్ బోస్‌కు వందే విశ్వభారత్ వీర పురస్కారం

కాళ్ల : దేశంలోని అన్ని రాష్ట్రాల్లో స్వాతంత్ర్య సమరయోధుల వారసులను సత్కరించటమే ఆశయంగా విశాఖపట్నానికి చెందిన విశ్వభారత్ మీడియా సంస్థ కృషి మరువలేనిదని అవార్డు గ్రహీత దంతులూరి సత్యనారాయణరాజు (మ్యాజిక్ బోస్) తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీన ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 130 మంది స్వాతంత్ర్య సమరయోధులను ఒక వేదికపై ఘనంగా సత్కరించారన్నారు. కోపల్లె గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు దంతులూరి కృష్ణంరాజు కుమారుడు ప్రత్యేక ఇంద్రజాలకుడు దంతులూరి సత్యనారాయణ రాజు (మ్యాజిక్ బోస్)కు వందే విశ్వభారత్ వీర పురస్కార్‌ను ఆ సంస్థ ఛైర్మన్ బలివాడ రమేష్, మేనేజింగ్ డైరెక్టర్ భీమ్‌శెట్టి వాసుదేవి అందించారు.

నాకు తెలియకుండా డంపింగ్ యార్డ్ నిర్మాణం ఎక్కడ?

రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌ను ప్రశ్నించిన శృంగవృక్షం సర్పంచి సూరిబాబు

సమన్వయంతో పని చేయాలి

పాలకోడేరు మండల సమావేశంలో ఎంపిపి చంటిరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

గ్రామంలో డంపింగ్ యార్డ్ నిర్మాణనికి కోర్టు నుంచి ఆదేశాలు వచ్చాయని చెబుతున్నారని, నాకు తెలీకుండా గ్రామంలో ఎక్కడ డంపింగ్ యార్డ్ నిర్మాణం చేస్తున్నారంటూ శృంగవృక్షం గ్రామ సర్పంచి జంగం సూరిబాబు రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజును ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి, చేపట్టబోయే ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ మండలానికి 440 రేషన్ కార్డులు మంజూరయ్యాయన్నారు. 13 గ్రామాల్లో రీ సర్వే ప్రారంభమైందని, నాలుగు గ్రామాల్లో పూర్తయిందని తెలిపారు. శృంగవృక్షం సర్పంచి సూరిబాబు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి డంపింగ్ యార్డ్ నిర్మాణానికి స్థలాన్ని అణ్వేషిస్తున్నామని, అనువైన కొన్ని స్థలాలు కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. గ్రామంలో కొంతమంది ఎవరో కోర్టుకి వెళ్లామని, ఆరు వారాల్లో డంపింగ్‌యార్డు నిర్మించాలని అధికారులకు ఆదేశాలు వచ్చాయని తెలిసిందన్నారు. అసలు తనకు తెలియకుండా డంపింగ్ యార్డు స్థలం ఎక్కడ ఉందో చెప్పాలని రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌ను ప్రశ్నించారు. కలెక్టర్, మండల రెవెన్యూ శాఖకు కోర్టు నుంచి నోటీసు అందిందని, అయితే దానిలో డంపింగ్ యార్డ్ నిర్మించాలనే విధంగా ఆదేశాలు లేవని, ఆరు వారాల్లో జవాబు ఇవ్వాలనే విధంగా ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. తాను సామాన్యమైన సర్పంచినని, సొంత డబ్బులతో రావి చెరువు పనులు చేయిస్తే డబ్బులు రాలేదన్నారు. అధికారులు చేయాల్సిన పనులు సర్పంచులగా తాము చేస్తున్నామన్నారు. జనసేన ఎంపిటిసి సభ్యులు సవరం సత్యకృష్ణ మాట్లాడుతూ రేషన్ ద్వారా కందిపప్పు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జగనన్న లే అవుట్‌లో పూడిక తీయాలన్నారు. ఎంపిపి చంటిరాజు మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ మురళీగంగాధరరావు, ఉప ఎంపిపిలు నరేష్, ఆదాడ లక్ష్మీతులసి, కో ఆప్షన్ సభ్యురాలు డాక్టర్ డిఆర్.స్వర్ణలత, సర్పంచులు బోల్ల శ్రీనివాస్, కడలి నాగేశ్వరి, ఇంజెటి మరియమ్మ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శృంగవృక్షం సర్పంచి సూరిబాబు

విస్సాకోడేరు సర్పంచి శ్రీనివాస్‌కు సత్కారం

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సర్పంచిగా అవార్డు పొందిన విస్సాకోడేరు సర్పంచి శ్రీనివాస్‌ను కో ఆప్షన్ సభ్యులు డాక్టర్ డిఆర్.స్వర్ణలత ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎంపిపి చంటిరాజు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ సర్పంచిగా శ్రీనివాస్‌కు అవార్డు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పాల జ్యోతి, నాగలక్ష్మి, శాంతకుమారి, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మి, పోలయ్య, ప్రసాద్, వెంకటరాజు, రాజేష్ పాల్గొన్నారు.

అప్పన్నపేటలో 'పొలంబడి'

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని అప్పన్నపేటలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మురళీకృష్ణ, ఎఒ వై.ప్రసాద్ మాట్లాడుతూ శత్రు పురుగులు, మిత్ర పురుగుల గురించి వివరించారు. వరి చేలకు ఎటువంటి పురుగు మందులు పిచికారీ చేయవద్దని చెప్పారు. ఉత్తమ అవార్డు తీసుకున్న ఎఒ ప్రసాద్‌ను రైతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నక్కా సూరి బంగారయ్య, ఉప సర్పంచి నూకారపు సుధాకర్ పాల్గొన్నారు.

నేడు, రేపు జీపుజాతా : సిపిఐ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం సిపిఐ కార్యాలయంలో ప్రచార జాతా కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ఈ నెల 17వ తేదీ నుంచి విశాఖపట్నంలో బస్సుయాత్ర బయలుదేరుతుందన్నారు. ఈ నెల 22వ తేదీన తణుకులో నిర్వహించే బహిరంగ సభలో పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సెప్టెంబర్ ఎనిమిదో తేదీన తిరుపతిలో నిర్వహించే భారి బహిరంగ సభతో యాత్ర ముగుస్తుందన్నారు. ఈ జిల్లాలో 17, 18 తేదీల్లో జరగనున్న జీపు జాతా జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లం రాము, దాస్యం రాము, అల్లం నరేంద్ర, రావూరి బాబి, బొమ్మిడి కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా బొలిశెట్టి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జనసేన పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టినరోజు వేడుకలను మాగంటి ఫంక్షన్ హాలులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జనసేన పట్టణ, గ్రామీణ ప్రాంతాల నాయకులు, అభిమానులు పట్టణ ప్రధాన వీధుల గుండా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గజమాలతో బొలిశెట్టిని సత్కరించి ఊరేగింపుగా మాగంటి కళ్యాణ మండపానికి తీసుకొచ్చారు. అక్కడ కేక్ కటింగ్ అనంతరం పలువురు బొలిశెట్టి శ్రీనివాస్‌ను పూలమాలలు వేసి సత్కరించారు. టిడిపి ఎంఎల్‌ఎగా పోటీ చేయనున్న వలవల మల్లికార్జునరావు (బాబ్జి) మాగంటి కళ్యాణ మండపానికి చేరుకుని బొలిశెట్టి శ్రీనివాస్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఏజెంట్లను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రెస్‌క్లబ్‌లో శ్రీ భవాని వెడ్డింగ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షురాలు బండి భవాని మాట్లాడుతూ అనేక మంది ఏజెంట్లు నిర్విరామంగా పనిచేస్తూ చాలీచాలని పారితోషికంతో జీవిస్తున్నారన్నారు. వీరికి ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు. సంఘం సంకల్పంతో జీవిత బీమా ఇన్సూరెన్స్ పాలసీలు తమ సొంత ఖర్చులతో చేస్తున్నందుకు గర్వపడుతున్నామన్నారు. రాష్ట్ర వైస్ ఛైర్మన్ చింతాల అంజిబాబు మాట్లాడుతూ బండి భవాని గృహ నిర్మాణం కోసం రూ.10 వేలు, ఇన్సూరెన్స్ పాలసీ రూ.10 లక్షలు వరకు పొందే విధంగా 18 నుంచి 60 సంవత్సరాల వయసు వారికి వర్తించేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బిహెచ్.జోసెఫ్ పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - ఆచంట

వార్షిక ప్రణాళికలో వృద్ధుల సంక్షేమానికి తగినన్ని నిధులు కేటాయించాలని వృద్ధుల సంక్షేమ అధ్యక్ష కార్యదర్శులు కొల్లిపర వెంకన్నబాబు, బాలనాగు శ్రీరామ్మూర్తి (రాంబాబు) డిమాండ్ చేశారు. ప్రపంచ వృద్ధుల కోరికల దినోత్సవం సందర్భంగా వారి ఆస్తి, ప్రాణ రక్షణ కల్పించాలని కోరుతూ తహశీల్దార్ సుబ్రహ్మణ్యానికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకన్నబాబు, శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను, ప్రత్యేక డైరెక్టర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. 1999లో భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన వృద్ధుల జాతీయ విధానాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం 2007ను పటిష్టంగా అమలు చేసి తగినన్ని నిధులతో పాటు సిబ్బందిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రతి జిల్లాకు డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను, తగు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.

ఎన్ఐటిలో ధన్యశ్రీకి సీటు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

డాక్టర్ సబిత జూనియర్ కళాశాలలో ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ పూర్తి చేసిన కడితల ధన్యశ్రీ జెఇఇ పరీక్షల్లో ర్యాంకు సాధించి అగర్తల ఎన్ఐటిలో సీటు సాధించింది. ఈ సందర్భంగా భీమవరం ఆర్‌డిఒ, పాలకొల్లు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ దాసిరాజు ధన్యశ్రీని సత్కరించారు. ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ విద్యాసంస్థ బహుకరించిన రూ.రెండు లక్షల చెక్కును భీమవరం ఆర్‌డిఒ కార్యాలయంలో ధన్యశ్రీకి అందించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసిరాజు మాట్లాడుతూ ఉత్తమ విద్యాబోధన అందించడంతో పాటు ఉన్నత విద్య కోసం పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయమని, ఈ విధంగా విద్యార్థులను ప్రోత్సాహిస్తున్న ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ పలువురికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. సబిత కాలేజీ సెక్రటరీ, కరస్పాండంట్ మద్దాల వాసు మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో ప్రతిభ కలిగి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఉల్లంపర్రు మాంటిస్సోరిస్, డాక్టర్ సబిత విద్యాసంస్థలు అండగా ఉంటూ సహకారాన్ని అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వసంతలక్ష్మి, ఐఐటి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వేగేశ్న అరుణ, మేనేజర్ రావాడ సతీష్ పాల్గొన్నారు.



చెక్కు అందుకుంటున్న ధన్యశ్రీ

ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థినులకు నగదు బహుమతులు

చెక్కు అందుకుంటున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఫైనల్ ఇయర్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థిని ఈదర సాత్వికకు, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థిని దేవులూరి రాజరాజేశ్వరికి ఓరుగంటి సుందరి మెరిటోరియస్ అవార్డు కింద ఒక్కొక్కరికి రూ.25 వేల నగదు బహుమతి అందించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. స్థానిక కళాశాలలో స్కాలర్‌షిప్ మాన్యువల్ చెక్కును బుధవారం అందించారు. ఈ సందర్భంగా అలుమిని అసోసియేషన్‌కు చెందిన డాక్టర్ వికె.విశ్వనాథరాజు మాట్లాడుతూ అమెరికాలో ఉన్నత స్థానంలో ఉన్న కళాశాల పూర్వ విద్యార్థి ఇసిఇ చదివిన ఓరుగంటి శివభరత్ ఈ స్కాలర్‌షిప్ ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఏటా మూడో సంవత్సరం నాటికి ఇసిఇ విభాగంలోని టాపర్, మిగిలిన అన్ని బ్రాంచీలోని టాపర్‌కు ప్రతి ఏటా ఒక్కొక్కరికి రూ.25 వేలు నగదు బహుమతి పంపిస్తున్నారని చెప్పారు. గత 15 ఏళ్లుగా చేస్తున్న కృషి మెరిట్ విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు చేతులమీదగా విద్యార్థినులకు నగదు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణమరాజు, ప్రొఫెసర్ పి.సుబ్బారావు, ఎఎస్‌సి హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్, ఇసిఇ విభాగం హెడ్ డాక్టర్ ఎన్.ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : ఎంఎల్ఎ మంతెన

ప్రజాశక్తి - ఉండి

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తుకు భరోసా ఉంటుందని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని చెరుకువాడ గ్రామంలో పార్టీ గ్రామ అధ్యక్షులు ఇర్రింకి సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన టిడిపి అధికారంలోకి వస్తే ప్రజలకు చేకూరే లబ్ధిని వివరిస్తూ ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, మహిళా అధ్యక్షురాలు వత్సవాయి సుజాత, నాయకులు జుత్తిగ శ్రీనివాస్, కట్టా రాంబాబు, మంతెన రమాదేవి, వేగేశ్న అనంతలక్ష్మి, దూసనపుడి రాంబాబు, కాగిత బుజ్జి, గొల్ల విక్టర్‌బాబు, పాలపర్తి బాలాజీ పాల్గొన్నారు.

మొగల్తూరు : మహిళాభ్యున్నతి టిడిపితోనే సాధ్యమని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు సిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పేరుపాలెం సౌత్ గ్రామంలో బుధవారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి మాట్లాడారు. రాజమండ్రి మహానాడులో చంద్రబాబు ప్రకటించిన పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మొగల్తూరు మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, సత్తినేని బాబ్జి, చల్లా సుబ్రహ్మణ్యం, గుత్తుల శేషారావు, సత్తినేని సర్వేశ్వరరావు, పాల రాంబాబు, పాల గోపాలకృష్ణ, టిడిపి నేతలు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

తాడేపల్లిగూడెం :హెల్మెట్ ధరించడం బాధ్యతగా స్వీకరించాలని పట్టణ ఎస్ఐ జెజె.ప్రసాద్ సూచించారు. స్థానిక గొల్లగూడెం సెంటర్‌లో బుధవారం హెల్మెట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ దరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, MATTI BHARATH KUMAR, S/O. MATTI SYAM SUNDAR JYOTHI BABU, D.NO. 6-131, PEDAPETA, SIDHANTHAM, PENUGONDA (M), W.G.DT. A.P. I HAVE CHANGED MY NAME FROM MATTI BHARAT KUMAR (OLD NAME) TO MATTI BHARATH KUMAR (NEW NAME) HENCE AFTER ALL MY DOCUMENTS AND CORRESPONDENCE WILL BE COUNTINUE WITH MY NEW NAME MATTI BHARATH KUMAR

పబ్లిక్ నోటీసు

మా క్లయింటు అయిన **అడుసుమిల్లి అజయ్‌కుమార్**, S/o. జానకిరామయ్య, R/o. డో.నెం. 751/6-1, ఆదర్శనగర్, ఏలూరు, ఏలూరు జిల్లా, వారు ఇచ్చిన వివరణపై ఇచ్చుచున్న పబ్లిక్ నోటీసు.
మా క్లయింటు ది. 12-04-2023వ తారీకున వారి మామగారైన (లేటు) అట్లూరి చిత్తరంజన్ గారి ఇల్లు డో.నెం. 13-43 నుండి వారి పేరున ఉన్న **ఒరిజినల్ దస్తావేజు నెం. 5187/1992** ను తీసుకుని మోటారు సైకిల్‌పై పెదపాడు నుండి వట్లూరు రోడ్డు గుండా ఏలూరు వచ్చుచుండగా దస్తావేజు ఉన్న కవరు పడిపోయినది. కావున సదరు ఒరిజినల్ దస్తావేజు తారీకు 10-08-1992, Vide దస్తావేజు నెంబరు 5187/1992 ఎవరికైనా దొరికినచో ఈక్రింద తెలిపిన అడ్రసులో అందజేయగలరు.

ఈడ్పుగంటి శ్రీనివాసబాబు
అట్లూరి రవికుమార్
రోడ్ నెం.2, ఎన్‌జిఒ కాలనీ, అమీనాపేట
అడ్వకేట్స్, ఏలూరు
సెల్: 9491089199

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు వారి కోర్టులో
O.S.No. 295/2017

బిట్వీన్:
సామాంతుల రమేష్ బాబు (డైడ్) మరియు వగైరాలు ...వాదులు
మరియు
గంగాడ ఉమామహేశ్వరరావు మరియు వగైరాలు ...ప్రతివాదులు

పై నెంబరు గ్రంధములో వాదులు, ప్రతివాదులపై రూ.9,66,333/-లు వడ్డీ మరియు ఖర్చులతో సహా ప్రిలిమినరీ మార్టిగేజ్ డిక్రీ ఇప్పించమని పైకోర్టులో దాఖలు చేసి యున్నారు. దానిపై 6వ ప్రతివాది అయిన D-6: Macha Semyu Sree, D/o. Late Naga Babu, D/o. Late Macha Eswara Kanaka Lakshmi, D.No. 201-11-16, Gandhi Nagaram, Lavetivari Street, Eluru, Eluru District (D-6 beaing minor represented by her narutal guardian D-1 Gangada Uma Maheswara Rao) అను వారికి ఏవిధమైన అభ్యంతరములు ఉన్న ఎడల **ది.24-08-2023వ తేదీన ఉదయం గం|| 10:30 ని||లకు పై కోర్టులో స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

శ్రీ అట్లూరి పవన్‌కుమార్
న్యాయవాది, ఖండ్రికగూడెం,
తంగెళ్ళమూడి, ఏలూరు. ఏలూరు జిల్లా.
సెల్: 98488 37162

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు **శ్రీ రాయి సత్యనారాయణ, తండ్రి: రాముడు** గారికి అయితంపూడి గ్రామంలో **దాక్యుమెంటు నెం. 2973/2000** క్రయ దస్తావేజులు పొందియున్నారు. సదరు ఆస్తిని గృహ నిర్మాణం చేయుట కొరకు వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, తణకు బ్రాంచి నందు ఋణం తీసుకొనుచున్నాడు. సదరు ఆస్తికి సంబంధించి లింకు **దాక్యుమెంటు ఒరిజినల్ రిజిష్టరు దస్తావేజు నెం. 1162/1983,** ఈ లింకు ఒరిజినల్ దస్తావేజు జిరాక్స్ కాపీ తీసుకొనుటకు వెళ్ళుచుండగా ఈ దస్తావేజు కవరు తప్పిపోయినది. ఎంతో కాలముగా వెతికనా దొరకలేదు. వెరిటాస్ ఫైనాన్స్ తణుకు బ్రాంచి గారి నుండి నా క్లయింట్ ఋణాన్ని వినియోగించుకుంటున్నారు. ఒరిజినల్ దాక్యుమెంటు పోయిన దృష్ట్యా ప్రత్యామ్నాయంగా 1162/1983 యొక్క సర్టిఫైడ్ కాపీ ఋణ మొత్తానికి హామీగా సదరు బ్రాంచ్‌కు అవసరమైన అన్ని దాక్యుమెంట్సుతో పాటు డిపాజిట్ చేస్తున్నారు. కావున ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, సదరు ఒరిజినల్ దాక్యుమెంట్ కనుగొన్న లేదా దొరికినా వారు ఈ దిగువ ఇవ్వబడిన చిరునామాకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము. ఇంకనూ తెలియజేయునది ఏమనగా ఈ దాక్యుమెంట్సు దొరికినవారు ఎవరైనా వీటిని వినియోగించిన ఎడల చట్టవిరుద్ధము మరియు వారిపై అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడును. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

ఎ.నాగేశ్వరరావు
అడ్వకేట్ & నోటరీ
తణుకు, సెల్: 9110382946

మహారాజశ్రీ ఏలూరు ఫ్యామిలీ కోర్టు /7వ అదనపు జిల్లా వారి కోర్టు :: ఏలూరు
ఎఫ్.డి.ఐ.ఎ.నెం. 1006/2019
ఓ.ఎస్.నెం. 54/2006

బిట్వీన్:
శ్రీమతి భావనా విశ్వనాథ్ ...పిటీషనరు
మరియు
శ్రీమతి చలపాటి వెంకాయమ్మ (డైడ్)
శ్రీమతి యలమంచిలి శేషాయమ్మ వగైరా ...రెస్పాండెంట్లు

పై నెంబరులో పిటీషనరు, ది.26-02-2018వ తేదీ గల ప్రిలిమినరీ పార్టిషన్ డిక్రీ రిత్యా షెడ్యూలు ఆస్తులు విభజించుటకు అడ్వకేట్ కమీషనర్‌ను నియమించి ఆస్తులను విభజించి ఫైనల్ డిక్రీ పాస్ చేయమని కోరుతూ పై నెంబరు పిటీషను దాఖలు చేసినారు. సదరు పిటీషనులో రెస్పాండెంట్లు 9 నుండి 10 వారలైన 1) శ్రీమతి చలపాటి భవిత, వైఫ్ ఆఫ్ శ్రీ వేంకటేశ్వరరావు 2) శ్రీ చలపాటి గోపి కృష్ణ దర్శిత్, సన్ ఆఫ్ శ్రీ వెంకటేశ్వరరావు 3) శ్రీ చలపాటి సాయి హర్షిత్, సన్ ఆఫ్ శ్రీ వెంకటేశ్వరారవు, ఈస్టు చోడవరం, తాడేపల్లిగూడెం మండలం, వారికి నోటీసు నిమిత్తం ది.15-09-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది. కాబట్టి పైవారలు పై కోర్టు వారి ఎదుట **ది.15-09-2023వ తేదీ ఉదయం గం|| 10:30 ని||లకు హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల వారి పరోక్షమున పిటీషను తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

ఎస్.వి.ఆర్.గాంధీ
ఏలూరు, పిటీషనరు తరుపు అడ్వకేట్
16-8-23. ఏలూరు.